# 18. ఊరు - అడవి

♦ పొట్లపల్లి రామారావు ♦

బ్రహ్మాండంగా మండుతోంది ఎండ. గడ్డిపోచ లేకుండా మాడి రుద్ర భూమివోలె కనిపిస్తున్నది నేల. నిప్పులా మండుతున్న ఎండలో నుంచి నడిచిపోతున్నాను. నా శరీరంలో సర్వశక్తులను ఎండ ఓడ్చివేసింది. దాహ బాధకు శరీరమంతా నీరసంగా ఉంది. ఎక్కడా నీరు జాడ కనిపించలేదు. దప్పి తప్ప నాకు.

"ఎంత కోపముంది".

వేరే సంగతి స్మృతిలో లేదు. దూరాన పచ్చ చెట్ల కింద ఓ ఊరు కనిపించింది. పచ్చని చెట్లను, మనుష్యుల ఇళ్ళను చూడటంతోనె నీరు త్రాగినట్టె కొత్త ప్రాణం వచ్చింది నాకు. ఊళ్ళోకి పోయి ఒక ఇంటి ముందు ఆగి 'దాహం' అని అరిచాను.

"ఏ ఊరు మీది?"

మొదలు అడిగాడు ఆయన! దాహముకన్నా అది ముఖ్యావసరమైనట్టు - దాహ బాధతో ఊరు, పేరు చెప్ప బుద్ధి పుట్టలేదు నాకు. నేను మాట్లాడలేదు.

ఆయన అట్లాగే నిలబడ్డాడు, పేరు చెప్పంది నీళ్ళు పోయనన్నట్లు. ఆయన అట్లా నిలబడడం నాకు బాగుండలేదు. కొంచెం సేపు నిలబడి ఇంకొక ఇంటికి పోయాను.

"ఎవరు మీరు?"

మళ్ళీ అదే ప్రశ్న.

మళ్ళీ అదే ప్రశ్న వినడం నాకు బాగుండలేదు. కొంచెం కోపం వచ్చింది.

"నాకు దాహం వేస్తోంది" అన్నాను.

"ఎవరంటే మాట్లాడవెందుకు?"

"ఎవరైతే ఏమిటయ్యా ... నీళ్ళు ఇయ్యటానికి?"

"ఎవరైంది చెప్పకూడదా?"

"దాహానికి ఎవరైతే ఏమిటి?"

"ఎవరని అడిగితే ఇంత బాధ ఏమిటయ్యా?"

అక్కణ్ణించి ఇంకో ఇంటికి పోయాను.

"నీ పేరేమిటి?"

మళ్ళీ అదే ప్రశ్న. నాకు మరీ కోపం వచ్చింది.

"ఎవరైతే ఏముంది?"

"కాదు, ఏం పేరు?"

"ఏదో ఒక పేరు."

"ఏమిటయ్యా... చెబుదూ?"

"అబ్బా! పేరు! పేరు! ఏ పేరైతే ఏముంది?"

"అంత విసుగు ఎందుకయ్యా?"

"నీరు నీరు అని ప్రాణాలు వదులుతున్నవాణ్ణి పేరు - పేరు! అని ఏడ్పిస్తారేమిటి?"

కోపంతో ఊరు దాటిపోయాను. ఊరు దాటిన వెనుక. నా తెలివి తక్కువ తనము, తొందరపాటు మీద నాకు కోపము వచ్చింది. ఎందుకంటే ఊరు పోయి అడవి వచ్చింది. అడవిలో నీళ్ళు ఎక్కడ దొరుకుతాయి? ఊరు పేరు అక్కర లేకున్న పొదలు తీగెలు నీళ్ళు యిచ్చేవి కావు. ఏమి చేయాలో నాకేమీ తోచలేదు. పిచ్చివాడి మోస్తరు అట్లాగే పోతున్నాను. నా శరీరం నా వశం తప్పదొడిగింది. నా కాళ్ళు తడబడదొడగాయి. మృత్యువు ముంచుకొస్తున్నట్లు కళ్ళు చీకట్లు క్రమ్మదొడ సాగాయి. దాహముతో అడవి మధ్య చచ్చిపోతానేమోనని భయం వేయదొడగింది. ఇంతలో హఠాత్తుగా ఓ చిన్న వాగు ఎదురైంది. నా విగతజీవాలు వాగు రూపంలో ప్రత్యక్షమైనట్టు పొంగిపోయాను.

వాగులో బాటసారులు ఓ చెలమ తోడి ఉంచారు. చెలమలోకి తలవంచి అమృతము త్రాగినట్టు ఆ నీరంతా త్రాగేశాను. దాహానికి నీరు దొరికినందుకు నాకు ఎంతో ఆనందమైంది. నీరు తాగుతూ తాగుతూ నాకు ప్రాణదానం చేసిన ఆ మూగతల్లికి కోటి నమస్కారాలు చేశాను.

కాని అన్నిటికన్నా నాకు మహా ఆనందం కలిగించిన విషయమేమిటంటే, ఆ చెలమ నా ఊరు, పేరు గూర్చి ప్రశ్నలు వేయలేదని. ఇది ఏదో అసాధారణ విషయమని నాలో నేను అలౌకికానందంతో పొంగిపోయాను.

• సెప్టెంబర్, 1953 •